




# కరపత్రం

SINCE 2014

బుధవారం ఏప్రిల్ 23 2025 సంపుటి :0 సంచిక :191 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## హిరోషిమాను సందర్శించిన సిఎం బృందం

## అణుదాడి మృతులకు నివాళి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారంజపాన్ లో బిజీబిజీగా గడిపారు. పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా జపాన్ వెళ్లిన తెలంగాణ రైజింగ్ టీమ్ హిరోషిమా నగరాన్ని సందర్శించింది. సీఎం రేవంత్రెడ్డి మంత్రి శ్రీధరాబాబుతో కలిసి జాతిపిత, శాంతిదూత మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం హిరోరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అటామిక్ బాంబ్ డోమ్ ను వారు సందర్శించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అణు బాంబు దాడిలో మరణించిన వారి స్మృతి చిహ్నం వద్ద పూలమాల వేసి సీఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. హిరోషిమా అసెంబ్లీని కూడా సందర్శించారు. సిఎం రేవంత్ బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌ను సందర్శించింది. హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ హాల్ సందర్శనకు వెళ్లిన బృందానికి అసెంబ్లీ స్పీకర్ తకాషి నకమోటో, వారి శాసనసభ్యుల బృందం ఘనంగా స్వాగతించింది. ముఖ్యమంత్రి వెంట ఐటీ–, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, అధికారులు జయేష్ రంజన్, వి. శేషాద్రి, అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి అసెంబ్లీని సందర్శించారు. శాసనసభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'హిరోషిమాకు రావటం గౌరవంగా ఉంది. హిరోషిమా అంటే ఆశ. ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరం. హిరోషిమా మాదిరిగానే ప్రజలు ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం' అని అన్నారు.

'శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని మంత్రి శ్రీధర్బాబు హిరోషిమా ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. పెట్టు–బడులకు కాకుండా పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చామని, కలిసికట్టు–గా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దామని అన్నారు. ఇప్పటికే యాభైకి పైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో అద్భుతంగా పనిచేస్తున్నాయని, మరిన్ని కంపెనీలను మంత్రి స్వాగతించారు. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ–, ప్రిసిసన్ మ్యానుఫాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో

## బండెనక బండి కట్టి..


### ఎడ్ల బండ్లతో ఎల్కతుర్తికి బయల్దేరిన సూర్యాపేట రైతాంగం..



బండెనక బండి కట్టి.. ఎడ్ల బండ్లతో సూర్యాపేట రైతాంగం ఎల్కతుర్తి బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బయల్దేరారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి స్వయంగా ఎడ్లబండి నడిపి రైతు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నెమ్మికల్ దండు మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు జగదీశ్ రెడ్డి. ఎడ్లబండ్ల యాత్రకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. సుమారు 5 కి.మీ పైగా జగదీశ్ రెడ్డి ఎడ్లబండి నడిపి యాత్రను ఉత్సాహంగా ముందుకు నడిపారు.



2 లో



## ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం 65.96 శాతం, ద్వితీయ సంవత్సరం 65.65 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇంటర్ ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మొత్తం 9.97లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు.

ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. మొదటి సంవత్సరంలో 73.08 శాతం, ద్వితీయ సంవత్సరంలో 77.73 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో బాలురు 59.74 శాతం, సెకెండియర్‌లో 64.60 శాతం మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో మేడ్చల్ జిల్లా 77.21 శాతంతో మొదటి స్థానంలో.. 48.43 శాతంతో మహబూబాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచాయి. ద్వితీయ సంవత్సరంలో ములుగు జిల్లా 80.12 శాతంతో టాప్‌లో ఉండగా.. కామారెడ్డి జిల్లా 54.93శాతంతో చివరి స్థానంలో నిలిచింది.

## జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం

### తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

- తెలుగు సినిమాలతో పాటు ఉర్దూ చిత్రాలకు కూడా ప్రోత్సాహం అందిస్తామని ప్రకటించారు.
- గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులపై నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు.
- గద్దర్‌ను తెలంగాణ గుండె చప్పుడును ప్రపంచానికి వినిపించిన గొప్ప వ్యక్తిగా కొనియాడారు.
- చిన్నారుల నుంచి వృద్ధులవరకూ గద్దర్ బాణీ, పాటలు ప్రజల్లో ప్రాచుర్యంలో ఉన్నాయని చెప్పారు.




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలుగు చిత్రాలను మాత్రమే కాదు.. ఉర్దూ చిత్రాలనూ ప్రోత్సహిస్తామని తెలిపారు. గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"తెలంగాణ గుండె చప్పుడును తన పాటల ద్వారా విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ గద్దర్ బాణి, పాటలను అనుకరిస్తారు. గద్దర్ తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారు. ఆయన పేరు మీద అవార్డులు ప్రదానం చేయడం హర్షణీయం. హైదరాబాద్‌లో జరిగే చలన చిత్ర అవార్డులు ఘనంగా నిర్వహించాలి. అందుకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి అందిస్తాం" అని అన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ పూర్తి.. తీర్పు రిజర్వ్



- కరీంనగర్ జిల్లా కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

2 లో

## ఆశా కార్యకర్తకు ఆర్టీసీ ఎండీ సన్మానం.. ఏడాది పాటు లగ్జరీ బస్సులో ఉచిత ప్రయాణం.. ఎందుకంటే ?



నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త మల్లికాంతమ్మను సోమవారం తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శాలువాతో సత్కరించారు. ఈ నెల 16న ఎల్లూరు గ్రామానికి చెందిన సువర్ణ అనే గర్భిణి హెల్త్ చెకప్ నిమిత్తం ఆశా కార్యకర్త మల్లికాంతమ్మతో కలిసి జిల్లా ప్రభుత్వ దవాఖానకు వెళ్లింది. కాన్పు అయ్యేందుకు వారం రోజులు సమయం ఉందని పెద్ద స్కానింగ్ చేయించుకొని రావాలని డాక్టర్ సూచించడంతో ఆమె నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్‌కు హైదరాబాద్ డిపో ఆర్టీసీ బస్సులో బయలు దేరింది.

2 లో

## తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం గులాబీ జెండానే : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



2 లో

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయినట్లు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సభావత్ లచ్చా నాయక్, పెద్దమ్మ తండా గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ సభావత్ సుమన్ నాయక్‌తో పాటు వారి అనుచరులు సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ గులాబీ జెండాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ఏప్రిల్ 23 2025

# వాతావరణ మార్పులు,వడదెబ్బపై పోస్టర్ల ఆవిష్కరణ



**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,ఏప్రిల్ 22 :**
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా వాతావరణ మార్పులు దాని ప్రభావం మరియు వడదెబ్బ నుండి రక్షించుకుందాం అనే పోస్టర్లను జిల్లా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు అంకిత్ తో కలిసి ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,వాతావరణ మార్పులు దాని ప్రభావం వల్ల తీవ్రమైన వేడితో కూడిన ఎండలు ఉన్నందువల్ల జిల్లా ప్రజలంతా సరియైన జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. ముఖ్యంగా వీలైనంతవరకు ఇంట్లోనే ఉండడం,సరిపడా ద్రవాలు తీసుకోవడం,కాటన్ వస్త్రాలను ధరించడం,తొందరగా వడదెబ్బకు గురయ్యే వారు ఇతరుల కన్నా ఎక్కువ జాగ్రత్తగా ఉండడం. వివిధ శాఖల జిల్లా అధికారులు వడదెబ్బ నివారణ పైవారి ప్రణాళిక కనుగుణంగా చేయవలసినవి చేయకూడనివి పాటించేలా చూడాలన్నారు. అదేవిధంగా యజమానులు వారి వద్ద పనిచేసే కార్మికుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.వైద్యాధికారులు, వైద్య సిబ్బంది అందరూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఔషధాలు సరిపడా ఉంచుకొని,వడదెబ్బకు గురైన వారికి తక్షణమే చికిత్స అందించాలన్నారు.అదేవిధంగా ప్రజల్లో విస్తృతంగా వడదెబ్బపై అవగాహన కలిగించాలన్నారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజశ్రీ గారు,పి ఓ ఎన్ సి డి డాక్టర్ సామ్రాట్ యాదవ్, డిప్యూటీ డెమో నాగలక్ష్మి,డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు,హెచ్ ఈఓ నాగరాజు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్లో ప్రతిభ చాటిన అర్సపల్లి శ్రీ శౌర్య



**కరపత్రం బాన్సువాడ ఏప్రిల్ 22**
బాన్సువాడ పట్టణానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకుడు అర్సపల్లి సాయి రెడ్డి కూతురు శ్రీ శౌర్య హైదరాబాదులోని మల్లంపేట్ నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యనాభ్యసించగా మంగళవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 992 మార్కులు సాధించడంతో విద్యార్థిని శ్రీ శౌర్యను అధ్యాపకులు, బంధుమిత్రులకు అభినందనలు తెలియజేశారు.

# బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా "ఛలో వరంగల్" బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుక వాల్ పోస్టర్ ఆవిష్కరణ....



**కరపత్రం కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22**
నగరంలోని నంది హిల్స్ లోని కేటీఆర్ నివాస కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో రూపొందించబడిన "ఛలో వరంగల్" బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకల వాల్ పోస్టర్ ను బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఈనెల 27న వరంగల్ లో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు కుత్బుల్లాపూర్ నుంచి భారీ సంఖ్యలో బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుగారు, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు...

# వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

**కరపత్రం కుకునూరుపల్లి ఏప్రిల్ 22,**
కుకునూరుపల్లి మండలం ముద్దాపూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు రిప్పల స్వామి ముదిరాజ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు అందరు ఈ నెల 27న వరంగల్లో పార్టీ ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలు అధికారంలో కేసీఆర్ లేని లోటును ప్రస్తుతం గుర్తించారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల ప్రభుత్వమని చెప్పి ప్రజలను మోసం చేయడం జరుగుతుంది ఇప్పటివరకు పూర్తిగా రైత రుణమాఫీ కాలేదు కళ్యాణ లక్ష్మి తులం బంగారం అని చెప్పి రాష్ట్ర లో ఎక్కడా కూడా ఇచ్చిన దాఖలాలు కూడా లేవు నిరుద్యోగులకు క్యాలెండర్ అని చెప్పి ప్రస్తుతం ఒక నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా ప్రజా పాలన కాలమును వృధా చేయడం జరుగుతుంది గత కెసిఆర్ పది సంవత్సరాల పరిపాలనలో ప్రతినిత్యం ప్రజల కోసం రైతుల కోసం ఆలోచించిన మనసున్న నాయకులు కెసిఆర్ మాత్రమేనని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం పోయిందని తెలియజేయడం జరిగింది రాబోయే రోజుల్లో మళ్లీ కెసిఆర్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేయడం జరిగింది కావున ఆదివారం నాడు జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని రిప్పల స్వామి తెలపడం జరిగింది..

# బండెనక బండి కట్టి..

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. చరిత్రలో ఎప్పుడు జరగని విధంగా బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో జరుగనున్న 25 ఏండ్ల బీఆర్ఎస్ పండుగకు సూర్యాపేట నుంచి రైతులు ఎడ్ల బండ్లతో తరలి వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. బండెనక బండి కట్టి.. 16 బండ్లు కట్టి అన్న పాటను సూర్యాపేట రైతులు మళ్ళీ గుర్తు చేస్తున్నారని తెలిపారు.రైతాంగంతో పాటు అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తప్పు చేశామని తెలుసుకున్నారు. నీడలో ఉన్న వాళ్ళం ఎండనబడ్డామని బాధతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపంగా ఉన్నారు. దండగ అనుకున్న వ్యవసాయాన్ని పండుగలాగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. దేవుడు లాంటి కేసీఆర్‌ని వదులుకున్నామన్న బాధలో ప్రజలంతా ఉన్నారు.అందుకే కేసీఆర్ మీద అభిమానంతో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రైతాంగం ఎడ్లబండ్లపై బయలుదేరారని పేర్కొన్నారు. ప్రజలంతా హాజరై ఈసభను కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేక సభలాగా నిర్వహించుకోవాలని భావిస్తున్నారు. గత పది రోజులు క్రితం రైతులు కలిసి ఎడ్లబండ్లపై వెళ్తామంటే.. 130 కిలోమీటర్ల మేర ఈ ఎండలో వెళ్లడం సాధ్యమవుతుందా..? అని అడిగాను. కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందులను తట్టుకున్నోళ్లం.. ఈ ఎండలను తట్టుకోవడం లెక్క కాదని రైతులు ధీమాగా చెప్పారు. సభ సమయానికి చేరుకునేలా ముందుగా అనుకున్న ప్రకారం 5 రోజుల ముందుగానే బయలుదేరారని జగదీశ్ రెడ్డి తెలిపారు.ఎల్కతుర్తి మట్టిని తాకి.. రజతోత్సవ సభను తిలకించి.. కేసీఆర్ మాటలు వినాలన్న రైతుల తపన ఎంతో ఆనందాన్నిచ్చింది. కేసీఆర్ పైన రైతాంగం చూపుతున్న అభిమానాన్ని చూస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ మీద వారికి ఎంత వ్యతిరేకత ఉన్నదో అర్థమవుతుంది. కొండంత అభిమానంతో పాటు సాహసోపేతమైన యాత్రగా ఈ ఎడ్లబండ్లలో వెళ్తున్న రైతులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు జగదీశ్ రెడ్డి.రైతుల యాత్రకు చివ్వేంల నాయకుల చేయూత..ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు సూర్యాపేట నియోజకవర్గంలో ఆత్మకూర్ (ఎస్) మండలం నుంచి ఎడ్లబండ్లతో బయలుదేరిన రైతులకు చివ్వేంల బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేయూతనందించారు. ఈ సందర్భంగా యాత్ర ప్రారంభించిన జగదీశ్ రెడ్డి చేతుల మీదుగా ఎద్దుల గ్రాసం కోసం ఐదు వేల రూపాయలను రైతులకు అందజేశారు.

# చెన్నమనేని రమేశ్‌పై డీజీపీకి ఆది శ్రీనివాస్ ఫిర్యాదు



హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. భారత పౌరసత్వం లేకున్నా తప్పుడు పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెన్నమనేనిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. ఇప్పటికే చెన్నమనేనిపై సీడీఐ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు వివరాలు అందించడానికి బుధవారం తమ కార్యాలయానికి రావాలని ఆది శ్రీనివాస్‌ను పిలిచారు. తన పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ హైకోర్టులో సవాల్ చేయగా... ఆయన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి కొట్టివేసిన విషయం తెలిసిందే. అంతేకాదు.. కోర్టు ఆదేశంతో పౌరసత్వంపై ఫిర్యాదు చేసిన ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు, లీగల్ సర్వీసెస్ అథారిటీకి రూ.5 లక్షలను చెల్లించాలని ఆదేశించింది. దీంతో సోమవారం ఆ నగదును చెన్నమనేని డీడీ రూపంలో అందజేశారు.

# ఎస్ఎల్బీసీలో డేంజర్ జోన్‌లో మృతదేహాలు.. వెలికితీతకు బ్రేక్

అచ్చంపేట : శ్రీశైలం ఎడమగట్టు సొరంగంలో జరిగిన ప్రమాదంలో మిగిలిన ఆరుగురి మృతదేహాల వెలికితీతకు బ్రేక్ పడింది. ఇప్పటివరకు 281 మీటర్లలో పేరుకుపోయిన మట్టి, బురద, శకలాలు, బండ రాళ్లు తదితర వాటిని తొలగించారు. లోకో ట్రైన్, కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటికి తరలించారు. మిగిలిన 43 మీటర్లలో తవ్వకాలు చేపట్టాల్సి ఉండగా అక్కడ ప్రమాదకర పరిస్థితి నెలకొడంతో మృతదేహాల అన్వేషణ నిలిచిపోయింది. కేవలం టన్నెల్లో వాటర్గ్ ప్రక్రియ, మట్టి, స్టిల్ కటింగ్ లను బయటికి పంపుతున్నారు.డేంజర్ జోన్‌లో ఉన్న మృతదేహాలను బయటకి తీయాలంటే ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆదారపడి ఉంది. ప్రభుత్వం నిర్ణయం కోసం బాధిత కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. ఎస్ఎల్బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి మంగళవారం నాటికి 60 రోజులు అయింది. ఆరుగురి మృతదేహాలు డేంజర్ జోన్ లోనే ఉంటాయని భావిస్తున్నారు.డేంజర్ జోన్ లో తవ్వకాలు జరుపడానికి అవకాశం లేనందున అక్కడివరకు తవ్వకాలు జరిపి మృతదేహాల కోసం అన్వేషణ చేసిన ఫలితం లేకుండా పోయింది. దీంతో మిగిలిన డేంజర్ జోన్ 43 మీటర్లు పరిధిలో మృతదేహాలుఉంటాయని భావిస్తున్నారు. డేంజర్ జోన్ లోకి వెళ్లితే సహాయక సిబ్బంది ప్రాణాలకే ముప్పు కావడంతో అక్కడి వరకే అన్వేషణ చేశారు.డేంజర్ జోన్‌లోకి వెళ్లలేని ప్రమాదకరపరిస్థితి ఏర్పడడంతో మృతదేహల వెలికితీత ఎలా? అనేది ఈ నెల 24న హైదరాబాద్‌లో జరిగే టెక్నికల్ కమిటీ, నిపుణుల కమిటి తేల్చనున్నది. అంతవరకు టన్నెల్‌లో మిగిలిన మట్టి, బురద, స్టీల్, రాళ్లు తొలగింపు పనులు కొనసాగించనున్నారు. డివాటరింగ్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. స్టీల్ కత్తిరింపు, బండరాళ్లనులోకోట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. అయితే మృతదేహాల కోసం అన్వేషణ డేంజర్ జోన్ మినహా మిగిలిన ప్రదేశాల్లో ముగిసింది. టెక్నికల్ కమిటీ తదుపరి చర్యలపై సమీక్షించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నది. ప్రభుత్వ నిర్ణయం బట్టి డేంజర్ జోన్‌లో తవ్వకాలు చేపట్టనున్నారు.

## మృతుల కుటుంబాలకు నిరాశ?

పేదరికంతో ఉన్న కుటుంబాలకు ఆసరాగా ఉపాధి కోసం రాష్ట్ర సరిహద్దులు దాటి వచ్చిన టన్నెల్ ప్రమాదంలో మృతిచెందిన కార్మికులు, ఇంజినీర్లు, మీషన్ ఆపరేటర్ల కుటుంబాలు కడసారి చూపుకోసం ఎదురుచూస్తున్నారు. ఎనిమిది మందిలో ఇద్దరి మృతదేహాలు లభ్యంకాగా మిగిలిన ఆరుగురి మృతదేహాల కోసం కుటుంబాలు నిరంతరం ఎదురుచూసినా ఉపయోగం లేకుండా పోయింది.మొదట్లో ప్రభుత్వం, మంత్రులు హెలికాప్టర్లో వచ్చి హడావుడి చేసి కొన్ని రోజుల తర్వాత అధికారులకు అప్పగించేశారు. డేంజర్ జోన్ ప్రమాదకర పరిస్థితి లేకపోతే ఖచ్చితంగా శ్రమించి మృతదేహాలు బయటకు తెచ్చేవారమని రెస్క్యూ సిబ్బంది తెలిపారు. డేంజర్ జోన్‌లోకి వెళ్లడం అతికష్టంగా మారడంతో వెళ్లలేకపోతున్నామని, ఒకవేళ ప్రయత్నాలు చేసినా పై నుంచి కూలిపడే ప్రమాదం ఉందని తెలిపారు.

# జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం

మొదటిపేజీ తరువాయి
జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు పేర్కొన్నారు. హెచ్ఐసీసీ వేదిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఇస్తున్న ఈ పురస్కారాల ఎంపిక కోసం 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. జ్యూరీ కమిటీకి ఛైర్మన్‌గా నటి జయసుధ ను ఎంపిక చేశారు. అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లు రాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్లు ఇటీవల వెల్లడించారు. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ప్రస్తుతం జ్యూరీ సభ్యులు పరిశీలిస్తున్నారు.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ పూర్తి.. తీర్పు రిజర్వ్

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: కరీంనగర్ జిల్లా కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. గతేడాది నవంబర్ 1న ఎన్నికల ప్రచారసభ నిర్వహించిన కౌశిక్‌రెడ్డి.. ఓటర్లు తనకు ఓటు వేయకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని వ్యాఖ్యానించారు. దీనిపై ఎన్నికల నోడల్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కమలాపురం పోలీసులు కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు నిర్వహించి అభియోగపత్రం దాఖలు చేశారు. రాజకీయ కక్షల కారణంగానే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఆత్మహత్య పేరుతో ఎన్నికల ప్రచారసభలో ఓటర్లను బెదిరించారని ప్రభుత్వ తరఫు న్యాయవాది అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకే నోడల్ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. సాక్షులుగా ఓటర్ల వాంగ్మూలాన్ని ఎందుకు నమోదు చేయలేదని ప్రభుత్వ న్యాయవాదిని కోర్టు ప్రశ్నించింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

# ఆశా కార్యకర్తకు ఆర్టీసీ ఎండీ సన్మానం.. ఏడాది పాటు లగ్జరీ బస్సులో ఉచిత ప్రయాణం..

మొదటిపేజీ తరువాయి
అయితే పెద్దకొత్తపల్లి మండల పరిధిలో ఆదిరాల సమీపంలో సువర్ణకు నొప్పులు రావడంతో వెంటనే స్పందించిన ఆశా కార్యకర్త ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌కు వివరించడంతో వారు బస్‌ను ఆపివేసి మగవారిని కిందికి దించివేసింది.ఆశా కార్యకర్త తో పాటు మరికొంతమంది మహిళలు కలసి ఆర్టీసీ బస్సులోనే ప్రసవం చేయడంతో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమాశంకర్ తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దృష్టికి తీసుకెళ్లగా ఆర్టీసీలో జన్మించిన పండంటి బిడ్డకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం సౌకర్యం, ఆశా కార్యకర్త మల్లికాంతమ్మకు సన్మానంతో పాటు ఒక సంవత్సరం పాటు తెలంగాణ ఆర్టీసీ సూపర్ లగ్జరీ సర్వీసులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు.ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లను తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. గర్భవతి వెంట తోడుగా ఉండి నిండు ప్రాణాలను కాపాడిన ఆశా కార్యకర్త మల్లికాంతమ్మను కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం శ్రీనివాసులు మంగళవారం అభినందించారు.

# తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం గులాబీ జెండానే : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి


మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేక పోయిందని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని మరిచి, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. హామీలను ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతుందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఒక్క గ్యారెంటీ కూడా సక్రమంగా అమలు చేయకపోవడం దారుణమన్నారు.కాంగ్రెస్ పార్టీని వీడి తమ పార్టీలో చేరడానికి చాలామంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. కన్న తల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరి మోసపోయామని లచ్చానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి పార్టీలో చేరడం తనకెంతో సంతోషంగా ఉందని వివరించారు. దీంతో మండలంలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. పార్టీలో పెద్దమ్మ తండా మాజీ ఉప సర్పంచ్ రేఖ్య నాయక్, లక్ష్మణ్ నాయక్, విజయ నాయక్ తదితరులు చేరిన వారిలో ఉన్నారు.కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్, ముదిరాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గం కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆనేగౌని దామోదర్ గౌడ్, మహేశ్వరం మండల పార్టీ అధ్యక్షుడు రాజు నాయక్, డైరెక్టర్ పిట్టల పాండు ముదిరాజ్, మండల యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి, యూత్ నాయకులు తేజ నాయక్, జైపాల్, వెంకటేష్, దేవుల నాయక్, మోతిలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# 10 గ్రామాల్లో చేపల జాతర - గుభాళించే చేపల కూరలు..!

మొదటిపేజీ తరువాయి
ఏలూరు ఏజెన్సీ : కలిసుంటే కలదు సుఖం అన్న నానుడి తగ్గట్టుగా ఏలూరు ఏజెన్సీలో చేపల జాతర జరిగింది. ఏకంగా 10 గ్రామాలు కలిసి చేపల జాతర జరుపుకుంటారు.. ప్రతీ ఇంట్లోనూ చేపల పులుసు గుభాళింపే..! ఏలూరు ఏజెన్సీలో ప్రజలు ఏడాదికి ఒక్కసారి సమిష్టిగా ఊరి చెరువులో చేపల జాతర నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో చెరువులో చేపలు పెట్టడం జాతరలా ఉంటుంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం నీళ్లలోకి దిగి, చేపలను పట్టి, వాటిని కుప్పలుగా పోసేవాళ్లు. సమానంగా జరిగే పంపకాలు.. ఇదే సమయంలో వినిపించే చలోక్తులు, సరదాగా సాగే దెప్పిపొడుపులు, అన్యాయం జరిగిందంటూ సాగే అలకలు. చిన్నా, పెద్దా , బాబాయ్, పిన్ని, అత్తా మామ అంటూ వినిపించే పలకరింపులు.. మొత్తం ఒక జాతరలా కనిపిస్తుంది. వచ్చిన చేపలన్నిటినీ అంతా సమానంగా పంచుకుని వండుకుని తింటారు. ఆ గ్రామాల్లో ప్రతి ఇంటా చేపల వంటకాలే..! ఈ ఏడాది కూడా అదే వాతావరణంలో కుక్కునూరు మండలం చీరవల్లిలో చేపలను పెట్టారు. ఈ చెరువు పరిసరాల్లో దాదాపు 10 గ్రామాల ప్రజలు నివసిస్తుంటారు. వర్షాకాలంలో నిండుకుండలా ఉండే చెరువులు వేసవిలో నీరు ఇంకిపోయి వెలవెల పోతుంటాయి. అదే సమయంలో గిరిజనులు అక్కడకు చేరుకుని చెరువులో దిగి చేపలను పెడతారు. బచ్చా, శీలావతి, కొరమేను, వాలుగా ఇలా చాలా రకాల చేపలు దొరికాయి. ఇక, వాటిని పంచుకుని ఎవరి వాటా వాళ్లు చేపలను తామర ఆకుల్లో ఉంచుకుని ఇళ్లకు తీసుకువెళ్లారు. ఇక మంచి ఘుమఘుమలాడే చేపల కూర వాసనలతో కుక్కునూరు పరిసర ప్రాంతాలు గత రెండు రోజులుగా గుభాళించాయి..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ఏప్రిల్ 23 2025

# మహేష్ కుమార్ గౌడ్,సుదర్శన్ రెడ్డిలను కలిసిన ఏర్గట్ల గ్రామస్థులు



**కరపత్రం ఏర్గట్ల,ఏప్రిల్ 22 :**
టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిలను మంగళవారం రోజున నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్గట్ల గ్రామస్థులు కలిసారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్గట్ల గ్రామభివృద్ధి కమిటి సభ్యులు,గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు ఏర్గట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేయబోతున్న శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం గద్దె పునర్నిర్మాణం,అనుమతుల గురించి విన్నవించారు.ఈ కార్యక్రమంలో వీడిసి సభ్యులు,అన్ని పార్టీల నాయకులు,యూత్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన ఏర్గట్ల నాయకులు



**కరపత్రం ఏర్గట్ల,ఏప్రిల్ 22 :**
మండల కేంద్రం ఏర్గట్లకు చెందిన ఇద్దరు మాజీ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు,బారాసా నాయకులు కొలిప్యాక రవి,జక్కుల నడ్పి భూమయ్య బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి సమక్షములో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.అందరు కలిసి కాంగ్రెస్ అభివృద్ధికి తోడ్పడుతూ,కాంగ్రెస్ ప్రజాపాలనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్ రెడ్డిని బలపరచాలని అయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోళ్ళ శివకుమార్,ఏలేటి మోహన్ రెడ్డి,బద్దం లింగ రెడ్డి,మేకల సాయన్న,పన్నాల నర్సారెడ్డి,ముస్కు మోహన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత...

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్టు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామం నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకుని రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# చెత్త సేకరణలో బోధన్ మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం...

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**



బోధన్ పట్టణంలోని పలు వార్డులలో చెత్త సేకరణలో బోధన్ మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత పదిహేను రోజుల నుండి రోజువారి చెత్త సేకరణ విషయంలో 34వార్డులోని కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీలో చెత్త సేకరణ పూర్తిగా నిలిచిపోయింది. ప్రతిరోజు ఉదయం చెత్త సేకరణ కోసం వచ్చే మున్సిపాలిటీ ఆటో చెడిపోయి మూలన పడింది. ఆటో సకాలంలో రాకపోవడం వలన చెత్తను రోజుల తరబడి ఇళ్లలో పెట్టుకోవాల్సి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోను మరమ్మత్తు చేయించాల్సిన మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి చెత్తను ఇళ్లలో ఉంచుకోవడం వలన దోమల బెడద పెరిగిపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త ఇళ్లలో నిలువ ఉండడం వలన దుర్గంధం వెలవడుతుందని దీంతో రోగాలు వస్తున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇతర కాలనీలలో చెత్త సేకరణకు వెళ్లే ఆటోను అధికారులు అడపాదడపా ఈ కాలనీకి పంపిస్తున్నప్పటికీ అది కూడా ఎప్పుడో ఒకసారి విధులలో ఉన్న సమయంలో మిట్ట మధ్యాహ్నం 3 గంటలకు ఆటో రావడం వలన మాకు ఎటువంటి ప్రయోజనం లేదని 34 వార్డు ప్రజలు తెలియజేస్తున్నారు. మధ్యాహ్నం వేళ ఇళ్లలో ఎవరు ఉండరని ఇటువంటి సమయంలో ఆటోను పంపించడం వలన ఎటువంటి ప్రయోజనం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు ఈ కాలనీకి సంబంధించిన చెత్త సేకరణ ఆటోను తక్షణమే మరమ్మతులు చేయించి ప్రతి రోజు పంపించాలని కాలనీ ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

# భారత కబడ్డీ జట్టు కోచ్ శ్రీనివాస్ రెడ్డి కి ఘన సన్మానం

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**



నిజామాబాద్ జిల్లా డిచ్పల్లిలో ఉన్న యూనివర్సిటీ యూనివర్సిటీ లో అన్యువల్ డే కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా పూర్వ అంతర్జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు,భారత్ జట్టు కబడ్డీ కోచ్,ప్రో కబడ్డీలో వివిధ జట్లకు కోచ్ గా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారిని తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సులర్ యాదగిరితో కలిసి కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

# భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...









**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం 14 ఏప్రిల్ 2025న ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చట్టం పై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ధరణి స్థానంలో కొత్తగా భూభారతి (భూమి హక్కుల చట్టం) తీసుకురావడం జరిగిందని తెలిపారు.ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని,హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని,రిజిస్ట్రేషన్,మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని సూచించారు.2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి,గడచిన 12 ఏండ్లుగా అనుభవంలో ఉంటూ 12.10.2020 నుండి 10.11.2020 మధ్య కాలంలో క్రమబద్దీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు.అట్టి వాటిని రికార్డు లలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు.వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ,పాసు పుస్తకాలలో భూమి పటం,భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని తెలిపారు.తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని,ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని,కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు.భూదార్ కార్డుల జారీ, రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ చట్టంలో ఏమైనా అభ్యంతరాలు,అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని అన్నారు.సాదా బైనామాలు,వారసత్వంగా వచ్చిన భూములపై 30 రోజుల్లోగా విచారణ చేయడం జరుగుతుందని,ఒకవేళ అట్టి గడువులోగా విచారణ చేయని పక్షంలో రిజిస్ట్రేషన్ అయినట్లుగా భావించవచ్చని తెలిపారు.ప్రజలు ఈ చట్టం పై అవగాహన ఏర్పర్చుకోవాలని,వారికి ఉన్న భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం మే మొదటి వారం నుండి గ్రామాలలో సదస్సులు నిర్వహించేందుకు వచ్చే అధికారులకు అర్జీలు సమర్పించవచ్చని సూచించారు.కాగా,అంతకుముందు మెండోరా మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని రైతులకు భుభారతి చట్టంలోని కీలక అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ సదస్సులలో రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్,స్పెషల్ ఆఫీసర్ స్రవంతి,స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# ఎల్.ఆర్.ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు అవకాశం...
- ఈ నెల 30లోగా చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తింపు...
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
అనధికార లే ఔట్ల క్రమబద్దీకరణకు,ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ నిర్ణీత గడువు లోగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారితో కలిసి రాష్ట్ర రెవెన్యూ,పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ నెల 30వ తేదీ నాటితో ఎల్ ఆర్ ఎస్ రాయితీ గడువు ముగుస్తుందని, దానిని పొడిగించబోమని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో అర్హులైన వారందరు ఎల్ ఆర్ ఎస్ రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని గుర్తు చేశారు.ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్ కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని తెలిపారు.రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకోవచ్చని అన్నారు.ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు.రుసుము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి వెంటదివెంట అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని అన్నారు.అనధికారికంగా లేఅవుట్లు చేసి,అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని కలెక్టర్ సూచించారు.ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి క్రమబద్దీకరణ చేసుకోవచ్చని తెలిపారు.క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు,నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని స్పష్టం చేశారు.దీనిని దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారందరు ఏప్రిల్ 30వ తేదీ లోపు క్రమబద్దీకరణ చేసుకోవాలని ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఇప్పటికే ఈ గడువు మార్చి 31తో ముగియగా,ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించిందని అన్నారు.రాయితీ వర్తింపునకు ఇదే చివరి అవకాశం అని కలెక్టర్ స్పష్టం చేశారు.


# ఎస్ఆర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకుల పంట


- ఎంపీసీలో 468/470 నలుగురికీ...
- బైపైసీలో 438/440 ఒకరికి...
- సీనియర్ ఇంటర్ లో 993 ఒకరికి...















**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని తెలంగాణ ఆంధ్ర డీజీఎం గోవర్ధన్ రెడ్డి అన్నారు.ఇంటర్ ఫలితాలు రెండో సంవత్సరం విద్యార్థులు ఎంపీసీ లో రాష్ట్ర స్థాయి మార్కులు 993 బి వైష్ణవి, 992 తహుర ఫాతిమా,990 హన్సిక,ఈ విధంగా 980 ఆపై మార్కులతో 127 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రతిభను కనబరిచారని తెలిపారు.ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఏ హర్షిని,ఎన్ దినేష్,సుప్పల శ్రీజ,శ్రీనిధి రెడ్డి 468 మార్కులు సాధించారు,అదేవిధంగా కే సంజన,మునిగంటి హరిణి,గుజ్జ రాజశ్రీ, దేశెట్టి వర్షిత్, గాండ్ల అఖిలేష్,హిమశ్రీ 467 మార్కులు సాధించారు.ఈ విధంగా 460 కి పైగా 91 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులను సాధించారని,విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని తెలంగాణ, ఆంధ్ర డీజిఎం గోవర్ధన్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభ కనబరుచుటకు విద్యార్థులలో ఉన్న ప్రతిభను సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయడం జరిగిందని,దానివల్లనే ఇంతటి చక్కటి ఫలితాలను సాధించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జ్ శ్రీకాంత్,కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు,శ్రీధర్ రెడ్డి,దేవేందర్ రెడ్డి అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

బుధవారం ఏప్రిల్ 23 2025

# ఎక్సైజ్ కార్యాలయాన్ని ప్రారంభించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి...









**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల భీముని గుట్ట ప్రాంతంలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎక్సైజ్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో పట్టణంలోని పాత రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలోకి మార్చడంతో మంగళవారం రోజున మాజీ మంత్రి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కామారెడ్డి,నిజామాబాద్ జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఎక్సైజ్ శాఖ అధికారులు,సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు.గ్రామాలలో ఎక్కడి నుండైనా ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని,ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచిస్తూ ఎక్సైజ్ కేసులలో తగిన శ్రద్ధ వహించాలన్నారు.ప్రస్తుతం ఈ భవనాన్ని వినియోగించుకోవాలని అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు.ఎక్సైజ్ శాఖ డిసి సోమిరెడ్డి,నిజామాబాద్,కామారెడ్డి జిల్లాల ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంటులు,మల్లారెడ్డి,హనుమంత్ రెడ్డిలతోపాటు,ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ శాఖ సిఐలు,ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,ఏసీపీ శ్రీనివాస్,తహసిల్దార్ విఠల్,మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ,పట్టణ సీఐ వెంకటనారాయణ,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి,పీసీసీ డెలిగేట్ గంగా శంకర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, మీరు నజీర్ అలీ,మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య,కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు తలారి నవీన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కళాశాల రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి.. ఎమ్మెల్యే పోచారం

**కరపత్రం బాన్సువాడ ఏప్రిల్ 22**

బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న నిర్వహించే రజతోత్సవ వేడుకలను పూర్వ విద్యార్థులు, అందరూ కలిసి విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాలు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాన్సువాడలో డిగ్రీ కళాశాల కొరకు ఎంతో తాను కృషి చేశానని, శ్రీ రామ్ నారాయణ కేడియా తన 12 ఎకరాల భూమిని విద్య అభివృద్ధికి దానం చేయడంతో, 1998 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కళాశాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 25 సంవత్సరాలుగా కళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, మరియు ఎన్నో ప్రైవేట్ రంగాల్లో కూడా ఉద్యోగాలు చేస్తూ సమాజంలో ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. న్యాక్ బి ప్లస్ గ్రేడ్ తో రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాల గా పేరు పొందడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా రజతోత్సవ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. సిల్వర్ జూబ్లీ వేడుకలకు కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాలస్వామి, బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ దుర్గం శ్యామల, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, వెంకన్న గుప్తా, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.





# ఎన్రోల్ అయిన న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలి

**– కార్పస్ ఫండ్ ను రూపాయలు 500 కోట్లకు పెంచాలి...**

**చనిపోయిన న్యాయవాదులకు 25 లక్షల డెత్ బెనిఫిట్ ఇవ్వాలి...**




జూన్ 2019 తర్వాత న్యాయవాదిగా ఎన్రోలు అయిన న్యాయవాదులకు హెల్త్ కార్డులు జారీ చేయకపోవడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (AILU) రాష్ట్ర నాయకులు సీనియర్ న్యాయవాది వి.సంఘం అన్నారు.కావున ఎన్రోల్ అయిన న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని,కార్పస్ ఫండ్ ను 500 కోట్లకు పెంచాలని ఆయన అన్నారు.ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో నిజామాబాద్ కోర్టు ప్రాంగణంలో మంగళవారం రోజున కరపత్రం,డ్రాఫ్ట్ అమెండ్మెంట్ బిల్ 2025 బ్రోచర్లు ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా వి.సంఘం గారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ వెల్ఫేర్ బోర్డులో ఉన్న 100 కోట్ల కార్పస్ ఫండ్ పై వచ్చే వడ్డీని హెల్త్ కార్డులకు కేటాయిస్తున్నారని,ఇది ఎటు సరిపోవడం లేదని చెప్పారు.2 లక్షలు బీమా సౌకర్యం వైద్య ఖర్చులకు సరిపోవడం లేదని దానిని రూపాయలు 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.హెల్త్ కార్డుల సౌకర్యం కల్పించాలని,నెట్వర్క్ హాస్పిటల్ జిల్లాలలో కూడా సెలెక్ట్ చేయాలని ఈ సందర్భంగా కోరారు.అనారోగ్యంతో పాటు ఇతరత్రా కారణాలతో మరణించిన న్యాయవాదులకు 25 లక్షల డెత్ బెనిఫిట్ అందజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డ్రాఫ్ట్ అడ్వకేట్ అమెండ్మెంట్ బిల్లులో సవరణలు చేయాలని,బిల్లు న్యాయవాదులకి నష్టదాయకంగా ఉందని అన్నారు.ఐలు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు హెల్త్ కార్డులు మరియు అదనపు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ,న్యాయవాదులతో సంతకాలు సేకరించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పరుచూరి శ్రీధర్, యూనిస్ ఖాన్, నరేందర్ రెడ్డి,కేశవ రావు,రవిబాబు,ఖలీద్, జునాథ్ అలీ, గగన్ అన్వేష్ జి.రమేష్, సుదర్శన్ నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## సిపిఐ (ఎంఎల్) పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ లెనిన్ కు ఘన నివాళులు...




**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

సిపిఐ (ఎం-ఎల్ )న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం బోధన్ పట్టణంలో మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ 155వ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం-ఎల్ ) న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య మాట్లాడుతూ 1917లో రష్యా దేశంలో విప్లవం విజయవంతం చేసిన గొప్ప మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ అని కొనియాడారు. సామ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా పోరాడడమే లెనిన్ కు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. మార్క్స యిజాన్ని ఆచరణలో అమలు చేసి చూపినవాడు లెనిన్ అని, దోపిడీ పీడన లేని నూతన సమాజాన్ని ఆకాంక్షించిన వాడు ఆయన అని, రష్యా ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నేడు ఉన్నది అంటే కామ్రేడ్ లెనిన్ వేసిన సోషలిస్టు పునాదులే కారణమని వరదయ్య అన్నారు. ప్రతి కమ్యూనిస్టు లెనిన్ స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. లెనిన్ జయంతి నాడే భారతదేశంలో సిపిఐ (ఎం-ఎల్ )పార్టీ ఆవిర్భావం జరిగిందని తెలిపారు. సిపిఐ (ఎం-ఎల్ )పార్టీ నాయకత్వంలో దేశంలో నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. ఆదివాసీలకు,దళితులకు లక్షల ఎకరాల భూములను పంచడం జరిగిందన్నారు. బడా బూర్జువా,భూస్వామ్య, దళారీ పాలకులకు వ్యతిరేకంగా పోరాడాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజ్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, పేటసాయిలు, బండారి గంగాధర్, సాయా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సబ్ కలెక్టర్ సమీక్ష...





**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

బోధన్ మండల, పట్టణంలోని తెలుగు,ఉర్దూ మాధ్యమాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పట్టణంలోని ఉపవిద్యా శాఖ అధికారి సమావేశపు హాలులో మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో మెరుగైన అభ్యాసన సామార్థ్యాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ వారిగా ఉత్తమ సామర్థ్యాలు సాధించిన పెంటఖుర్దు కాంప్లెక్స్ పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాల మావందికలాన్ ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, శక్కర్ నగర్ కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీపీఎస్ పాండు ఫారం ప్రధానోపాధ్యాయులు హైమది బేగం, జెసి కాంప్లెక్స్లోని జిపిఎస్ క్రిస్టియన్ కాలనీ ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, బిటీ నగర్ కాంప్లెక్స్ లోని జిపిఎస్ రంగర్ గల్లీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూరినస్సా, అమ్దాపూర్ కాంప్లెక్స్ పరిధిలోని బెల్లాల్ ప్రధానోపాధ్యాయులు శిరీష, కల్దుర్కి కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీ యుపిఎస్ మామందిఖుర్దు ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ లను సన్మానించి అభినందించారు. వేసవి సెలవులలో ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలని బోధన్ మండల విద్యాధికారి నాగయ్య కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రత్నాకర్, ఆరిఫ్ వుద్దీన్, స్వరూప, సీఆర్పీలు విజయ్, యూసుఫ్, బాబు, విజయ రేఖ,శివానంద్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠకుల సౌకర్యార్థం గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తాం...

**– ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి..**





**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీమంత్రి,బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని గ్రంథాలయ భవనంలో అదనంగా ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్ ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం అవసరమైన పుస్తకాలను సిద్ధంగా ఉంచామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలలో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించడానికి కృషి చేస్తున్నామని, డిజిటల్ బుక్ పుస్తకాలను సైతం చదువుకునేందుకు అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రంథాలయాల సమయాన్ని పెంచి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు చదువుకోడానికి వీలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు,విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసిపి శ్రీనివాస్, తహసిల్దార్ విఠల్, పట్టణ సీఐ వెంకటనారాయణ, టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, మీర్ నజీర్ అలీ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్లయ్య, దాము, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు తలారి నవీన్, అధికార ప్రతినిధి ప్రమోద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

# బోధన్ పట్టణంలో డాగ్ స్క్వార్డ్స్ తో తనిఖీలు...









**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

బోధన్ పట్టణంలో డాగ్ స్క్వార్డ్స్ తో తనిఖీలు చేపట్టారు. యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా మంగళవారం పట్టణంలోని బస్ స్టాండ్, ఆటో స్టాండ్, శక్కర్ నగర్ ఏరియా హోటళ్ళు, పాన్ షాపులు కాలేజీలను డాగ్ స్క్వార్డ్స్ తో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా బోధన్ పట్టణంలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ పై అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పట్టణంలో తనిఖీ లు చేపట్టడం జరిగిందని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.